# పూదియ

రచన :
శ్రీ బి. వి. డి. ప్రసాదరావు

(గతసంచిక తరువాయి)

అప్పుడే లెక్చరర్ రావడంతో క్లాస్ రూంలోకి నడిచాను, యాంత్రికంగా, నా వెనుకే పూదియకూడా వచ్చింది.

క్లాస్‌లో కూచున్నానేకాని, నా మనసుమాత్రం పరిపరి విధాలుగా చలిస్తోంది. ఎలాగో ఈ అవమానంలోంచి బయట పడాలి.

ఏం చెయ్యాలి? ఏమీ అర్థం కావడంలేదు. ఎంతో బాధగా వుంది.

చివరికి ఆలోచించి, ఆలోచించి ఓనిర్ణయానికి వచ్చాను. ఓ గట్టి వార్నింగ్‌తో లక్ష్మికి బుద్ధి చెప్పాలని నిశ్చయించు కున్నాను.

ఆ సాయంకాలం, కాలేజీ విడిచిపెట్టగానే, వెళ్ళి గేటు ముందు నించున్నాను.

కాలేజీ పల్చబడుతోంది, స్టూడెంట్స్ వెళ్ళిపోతూంటే.

పూదియ అప్పుడే వచ్చింది. నన్ను ఇంటికి రమ్మంది, తనతోపాటు.

రానన్నాను.

'మరిక్కడెందుకు? మీఇంటికైనా వెళ్లు.' పూదియ చెప్పింది.

'పనుంది, నువ్వు వెళ్ళు' విసురుగా చెప్పాను.

'ఏమిటాపని?! లక్ష్మిని ఏద్దైనా అడగాలనుకుంటు న్నావా?'

'..........'

'హుం. అది వట్టి తిక్కమనిషి. దాన్ని కలిశాను, కెమిస్ట్రీలాబ్‌లో. విషయాన్ని అడిగాను. చాలా ఫోర్స్‌గా వుంది; దానివ్యవహారం. అటువంటిదాంతో మన కెందుకు. రా, పోదాం.'

'నే రాను, వెళ్లు' కసురుతున్నట్టు అన్నాను,

కొన్నిక్షణాలు ఆగి, పూదియ వెళ్ళిపోయింది.

లక్ష్మికోసం నే నెదురుచూస్తూ నించున్నాను.

ఇంచుమించుగా కాలేజీ అంతా ఖాళీ అయిపోయింది.

టైం చూసుకున్నాను. పావుతక్కువ అయిదు అయింది అంటె, కాలేజీ విడిచిపెట్టేసి అరగంట అయింది.

అప్పుడే కెమిస్ట్రీ లెక్చరర్ లాబ్‌లోంచి బయటకు వచ్చారు. తన స్కూటర్ తీస్తున్నారు, 'బహుశా, ఇంటికి పోతున్నారేమో!' అని అనుకుంటున్నాను, అతను నన్ను దాటుకొని వెళ్ళిపోయారు.

అప్పుడే లాబ్‌లోంచి బయటికి వచ్చాడు, లాబ్ బోయ్ రామారావు.

వాడు నాకు బాగా తెలుసు. మా సీనియర్స్ వుంటే, వాడికి భయం, గౌరవం.

వాడివద్దకు వెళ్లాను.

'ఇంకా లాబ్ తెరిచే వుంచావేం?' అడిగాను, విషయం తెలిసికూడా.

వాడు చెప్పాడు; 'కొంతమంది ఇంకా ప్రయోగాలు చేస్తున్నారండి.'

'లెక్చరర్ వెళ్లిపోతున్నట్టుంది' అన్నానే.

'ఆఁ. అవునండి.'

నేను లాబ్ గుమ్మంవరకు వెళ్ళాను. లోనికి చూశాను. లక్ష్మి వుంది. ఆమెతోపాటు ఇద్దరు బోయ్ స్టూడెంట్సు కూడా వున్నారు. ఎవరిపనులతో వాళ్ళు తంటాలు పడు తున్నారు.

వెనుదిరిగాను. రామారావు ముందు ఆగాను.

'కాఫీ తెస్తావా?' వాడ్ని అడిగాను,

'కాంటీన్ మూసేస్తారు కదండీ' అన్నాడు రామారావు.

'బయటకెళ్ళి తీసుకురా' చెప్పాను.

'మీ ఇష్టం.'

డబ్బులిచ్చాను.

'ఇంత ఎందుకండీ?!'

'నువ్వు రూపాయి తీసుకో, టిఫిన్‌కు. ఆ మిగిలిన చిల్ల రతో నాకు కాఫీ తీసుకురా' చెప్పాను.

అంతలోనే బోయ్ స్టూడెంట్సు ఇద్దరూ బయటికి వచ్చేశారు. రామారావుతో చెప్పేసి, సైకిళ్ళు తీసుకొని వెళ్ళిపోయారు.

'వెళ్ళు, త్వరగా తీసుకురా. లాబ్‌లో ఫ్లాస్కు వుందిగా' అన్నాను.

రామారావు లాబ్‌లోకివెళ్లి ఫ్లాస్కు తీసుకువచ్చాడు.

'చూడు, గిరిజా కేఫ్ కెళ్ళి, కాఫీ తీసుకురా' చెప్పాను.

'అంతదూరం వెళ్ళాలా ?'

'ఆఁ. నేనుంటాగా, నువ్వు వచ్చేవరకు. వెళ్ళిరా,' గట్టిగా చెప్పాను.

వాడు మళ్ళీ మాట్లాడకుండా ముందుకు నడిచాడు,

వాడు గేటు దాటినంతవరకు వుండి, లాబ్‌లోకి తర్వాతనే నడిచాను.

లక్ష్మి ముందుకు వెళ్తున్నప్పుడు, ఆమె తలెత్తి చూసింది. వెంటనే తల దించేసుకుంది. పనిలో తల దూర్చింది,

ఆమెకు చాలా దగ్గరగా నించుని, చిన్నగా దగ్గేను.

'డిస్టెర్బ్ చెయ్యక, బయటికెళ్ళండి.' తల దించుకొనే అంది.

'నువ్వు ఎవరు చెప్పడానికి ?' విసురుగా అన్నాను.

'ఈ కాలేజీకి మీలాంటి స్టూడెంటునే.'- ఇంకా తలెత్తలేదామె !

'షటప్, సరిగ్గా సమాధానం ఇవ్వలేవా ?' చిరాగ్గా అన్నాను.

'నోరు పారేసుకోకండి.' తలెత్తింది లక్ష్మి.

'ఏం చేస్తావేం ?' అన్నాను నేను.

'ఉదయం చూశారుగా,' అంటూ అదోలా నవ్వింది లక్ష్మి.

'యూ...' నాలో కోపం ముందుకు వస్తోంది.

నిబ్బరంగా వుంది, లక్ష్మితీరు !

'ఉదయం ఎందుకు ఆగేనో తెలుసా ?'

'హుఁ. చేతకాదని చెప్పక, ఎందుకీ డొంక తిరుగుడు?'

'ఎవరికి చేతకాదు ? ఏం చేతకాదు ?' మరి కోపాన్ని పట్టలేక, ఆమెచెయ్యిని పట్టుకొని అరిచాను.

'మర్యాదగా చెయ్యి వదలండి.'

'ఫో. నీకా మర్యాద !'

'షటప్' అంటూ ఆమె విడిపించుకోడానికి ప్రయత్నిస్తోంది, మొరటగా.

'యూ...' అంటూ ఆమె బుగ్గమీద దెబ్బ వేశాను.



'య్యూ...నన్నే...నన్నే కొడతావా ?' అంటూ నాషర్టను పట్టుకొని గుంజుతోంది లక్ష్మి, ఆవేశంతో.

నాలో సహనం నశిస్తోంది.

ఆమె విడిపించుకోడానికి చేస్తూన్న ప్రయత్నాలు, నన్ను రెచ్చగొట్టేలా వున్నాయి.

దాంతో మరీ రెచ్చిపోయాను. అలోచనాశక్తిని కోల్పోయాను. పశువులా ప్రవర్తించాను. ఆమెను బలవంతంగా అనుభవించాను. ఆమె జీవితంతో ఆట ఆడుకున్నాను.

నాలో ఆవేశం తగ్గేసరికి, లక్ష్మి గోలగా ఏడుస్తూ, ఓ మూల వుంది. బాగా నగ్నంగా వుందామె.

నేనింత నీచంగా ప్రవర్తించాలని అనుకోలేదు. ఆవేశంతో తలవనితలంపుగా ఈపనిని చేశేశాను.

నామీద నాకే ఏహ్యాభావం పుట్టుకవస్తోంది. ఛీ ఛీ.

అప్పుడే నన్ను ఎవరో పిలిచినట్టు రావడంతో, అటు చూశాను, షాక్ తిన్నాను.

పూదియ, ఆమె తాతగారు లాబ్‌బయట నించుని వున్నారు !

వాళ్ళచూపుల్లో ప్రశాంతం ఏమాత్రం లేదు !

వాళ్ళను చూడలేక తలను తిప్పుకున్నాను.

అప్పుడే, నా ఆవేశానికి బలి అయిన లక్ష్మి ఒక్క పరుగులోవెళ్ళి, పూదియను వాటేసుకుంది. వెక్కి, వెక్కి ఏడుస్తోంది.

పూదియ ఆమెను ఓదారుస్తోంది.

పూదియ తాతగారు లక్ష్మిని ఏదో అడుగుతున్నారు.

నేను కలగచేసుకున్నాను. 'ఇంతకీ ఏం జరిగిందంటే.'

నా కడ్డుపడింది పూదియ.

'మాట్లాడక్కరలేదు. హుం.. మాటలతో చేతకానప్పుడు, శాంగా వూరుకోవాలి. అంతేకాని, ఇలా ఓ జీవితాన్ని నాశనం చెయ్యడానికి మనసు ఎలా వొప్పింది ?' కఠినంగా వుంది, పూదియ గొంతు.

నే నేపరిస్థితిలో ఇలా ప్రవర్తించానో చెప్పాలనుకుంటుంటే, పూదియ నన్ను లెక్కచెయ్యక. నన్ను మాటలతో చిత్రవధ చేసేస్తోంది. పైగా, తన తాతగారినికూడా మాట్లాడనివ్వడం లేదు.

# ప్రకృతి లీల

★

ఓ మానవుడా! వెనుతిరిగి చూడవోయి!
కలిమి లేములు కలకాల ముండవు.
చీకటిని చూసి భయపడకు.
వెలుగును చూసి ఆశ్చర్యపోకు.

చీకటీ వెలుగుల సమ్మేళణం
ఇది ప్రకృతి సహజం.
కలిమి లేముల సమ్మేళణం
చీకటి వెలుగుల ప్రతిరూపం.

పాడుబడ్డ ఇంట్లో గబ్బిలాల రొద,
దరిద్రుడి ఇంట్లో ఆకలి బాధ.
కాముకుండుడి ఇంట్లో కన్నెపిల్లల బాధ.
ప్రేమికుడి ఇంట్లో పిచ్చి పిచ్చి ఊహలు.

సిగ్గు కోపాన్ని జయిస్తుంది.
పాపాన్ని ప్రకోపింప జేస్తుంది
మనసు కలత చెందుతుంది.
తీయటి అనుభూతిగా మిగులుతుంది.

ఆకలి ప్రేమను జయిస్తుంది.
అన్యాయాన్ని చేయిస్తుంది
ప్రియుడ్ని మోసగిస్తుంది.
సమాజాన్ని శపిస్తుంది.

—వి. విజయభాస్కర్.

'రభస కాకుండా వుండాలంటే, లక్ష్మి మెడలో తాళి కట్టి తీరాలి. చివరిగా అంది పూదియ. ఆ క్షణాల్లో ఆమె గొంతు బాగా బొంగురుపోయింది.

నేనేం మాట్లాడలేకపోయాను.

నిజమే. పూదియ వాదనలో అర్థం వుంది. లక్ష్మి నా ఆవేశానికి బలయి, తన జీవితాన్నే కోల్పోయిందిగా. ఈ నిజం తెలిస్తే, ఆమె నెవరు పెళ్లి చేసుకుంటారు ? గుట్టుగా వుంచేస్తే, ఆమె మానసింగా ఎలా మరొకరితో కాపురం చెయ్యగలదు ? ఛ ఛ నేనేగా ఇంతటికీ కారణం.

'చేసినతప్పుకు శిక్షను అనుభవించాలి. తప్పదు. పూదియ మళ్ళీ నోరు తెరిచింది.

నేను మారు మాట్లాడలేకపోయాను.

తల వంచుకున్నాను.

గుట్టుగా అసలువిషయాన్ని ఉంచేసి, తను మధ్యవర్తిగా మారి, మా పెద్దలసమక్షంలో, నాకు, లక్ష్మికి పెళ్ళి జరిపించేసింది పూదియ, ఓ శుభముహూర్తాన్న !

పెళ్ళయినమర్నాడు నన్ను, లక్ష్మిని తనింటికి 'లంచ్' అని, బలవంతంగా తీసుకువెళ్లింది పూదియ.

పూదియ తాతగారు నాతో ఇదివరకటిలా మాట్లాడడం లేదు ! చాలా ముభావంగా మాట్లాడుతున్నారు !

లంచ్ అయిన తర్వాత—

'చూడండీ ! దయచేసి గతాన్ని మర్చిపోండి. ఇకపై, హాయిగా జీవితాన్ని గడపండి' అని; 'చూడమ్మా !లక్ష్మీ ! ఇతనిది కాస్త దుడుకైనస్వభావం. కాస్త అర్థం చేసుకొని, నడుచుకుంటే, ఏమీ ఉండదు' అని చెప్పి:—

'కూచోండి, ఇప్పుడే వస్తాను' అని పూదియ అక్కడ నించి వెళ్ళిపోయింది. ఆక్షణాల్లో ఆమె కళ్ళల్లోని కన్నీటి తెరలనం కంటపడ్డాయి. నాగుండె తరుక్కుపోయింది—

నా ఆవేశం, ఎంత దారుణంగా పరిస్థితుల్ని మార్చేసింది—

పూదియ తాతగారు ముందు, నేను, లక్ష్మి కూచున్నాం; కుర్చీలలో.

లక్ష్మి మూగగా గోడమీద పెయింటింగ్స్‌నుచూస్తోంది.

—చాలాసేపు మా ముగ్గురిమధ్య మౌనం నిలిచింది.

నేనా మౌనాన్ని మరి భరించలేను.

'పూదియ వచ్చినా బాగున్ను. ఆమెతో చెప్పి, వెళ్ళిపోవచ్చు' అనుకున్నాను.

'తాతగారూ ! ఓసారి పూదియను పిలుస్తారా ?' అని, అడిగాను.

తాతగారు లేచివెళ్లారు, అక్కడనించి.

కొన్ని క్షణాలతర్వాత, పెద్దగా కేక వినిపించింది. అది తాతగారిది ! పోల్చుకోగలిగాను.

ఆందోళనగా నేనటు పరుగులుతీశాను. లక్ష్మికూడా నా వెంటే వచ్చింది.

వంటగదిలోని దృశ్యాన్నిచూసి అదిరిపడ్డాను.

కరెంట్ ప్లగ్‌లో రెండు ఇనుపపుల్లలను పెట్టి, వాటిని పట్టుకొని పూదియ—అమెనులాగే భంగిమలో ఆమె తాతగారు-వున్నారు.

ఆత్రంగా హాలులోకివచ్చి, 'మైన్‌స్విచ్చు'ను 'ఆఫ్' చేశాను నేను.

నేను వెళ్ళేసరికి పూదియ, ఆమె తాతగారు నేలమీద పడివున్నారు.

లక్ష్మి వాళ్ళకు దగ్గరగా నించునివుంది.

నేనూ వాళ్ళముందుకు వెళ్ళాను. వొంగిచూశాను, పరిశీలనగా.

షాక్—షాక్—

వాళ్ళిద్దరూ ప్రాణాలకు దూరమైపోయారు.

నా గుండెను ఎవరో పిండేస్తున్నట్టుగా వుంది.

పూదియ పళ్ళమధ్య చిన్న చీటీ వుంది ! దాన్నందుకున్నాను.

అంచులో—'నాచావుకు ఎవరూ కారణం కాదు ! నా మనసే...' అని వ్రాసివుంది.

నాతల గిర్రున తిరుగుతున్నట్టు అనిపిస్తోంది. సరిగ్గా నించున్నాను. బలంగా ప్రక్కనున్న కిటికీని పట్టుకున్నాను.

—మానసికంగా చెడి పూదియ ఇలా ప్రవర్తించింది.

—శారీరకంగా చెడి లక్ష్మి అలా సాదించింది.

— మరి, రెండింటికీ గురైన నేను అడకత్తెరలో పోకచెక్కలా మిగిలిపోయాను.

—ఎంతగా ఆపుకుందామనుకుంటూన్నా కన్నీళ్ళు ఆగడంలేదు. ఉరకలతో బయట పడుతున్నాయి.

(సంపూర్ణం.)